ఆస్పత్రిలో చేరిన రజనీకాంత్

● ఆందోళనకు గురైన అభిమానులు

● మెడికల్ బులెటిన్‌తో ఊరట

చెన్నై, న్యూస్‌టుడే: నటుడు రజనీకాంత్ సోమవారం రాత్రి అకస్మాత్తుగా ఆస్పత్రిలో చేరడం, మంగళవారం ఉదయం నుంచి ఆయనకు కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వార్తలు రావడం అభిమానులను ఆందోళనకు గురిచేసింది. ఎట్టకేలకు ఆస్పత్రి యంత్రాంగం మెడికల్ బులెటిన్ విడుదల చేయడంతో ఊరట పొందారు. రజనీకాంత్ సోమవారం రాత్రి నగరంలోని గ్రీమ్స్‌రోడ్డు అపోలో ఆస్పత్రిలో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై సామాజిక మాధ్యమాల్లో పలు రకాల వార్తలు చక్కర్లు కొట్టాయి. ఎప్పటిలాగే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడానికి చేరినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. అధికారికంగా ఆస్పత్రి యంత్రాంగం నుంచి ఎలాంటి సమాచారం వెలువడలేదు. రజనీకాంత్‌కు గుండె శస్త్రచికిత్స చేయనున్నారని, ఐసీయూలో ఉంచారంటూ వార్తలు వెలువడ్డాయి. ఇది అభిమానులను మరింత ఆందోళనకు గురిచేసింది. సూపర్‌స్టార్ ఆరోగ్య విషయంపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణియన్ సైతం స్పందించారు. పరకడుపున వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉండటంతో ముందురోజు రాత్రి చేరినట్లు తెలిపారు. మూడుసార్లు ఆస్పత్రి యంత్రాంగంతో మాట్లాడామని, త్వరలో డిశ్చార్జి అవుతారని పేర్కొన్నారు. రజనీకాంత్ కోలుకోవాలంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వెల్లువెత్తాయి. రజనీకాంత్ త్వరగా కోలుకోవాలంటూ ఆయన కోట్లాది మంది అభిమానులతో పాటు తానూ కోరుకుంటున్నట్లు గవర్నర్ ఆర్.ఎన్.రవి తన 'ఎక్స్' పేజీలో తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన 'ఎక్స్' పేజీలో... 'ఆస్పత్రిలో చేరిన మిత్రుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను' అని తెలిపారు. ఈ నేపథ్యంలో సాయంత్రం అపోలో ఆస్పత్రి యంత్రాంగం మెడికల్ బులెటిన్ విడుదల చేసింది. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, క్షేమంగా ఉన్నారని, రెండు రోజుల్లో డిశ్చార్జి అవుతారని పేర్కొనడంతో అభిమానుల్లో ఆందోళనకు తెరపడింది.

అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలి

ముఖ్యమంత్రి స్టాలిన్



చెన్నై, న్యూస్‌టుడే: అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలని డీఎంకే ఐటీ విభాగానికి ఆ పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి స్టాలిన్ సూచించారు. సెప్టెంబరును ద్రావిడ మాసంగా డీఎంకే ఐటీ విభాగం నిర్వహించింది. ఆ విభాగం యూట్యూబ్ పేజీలో స్టాలిన్ మాట్లాడారు. వేలాది సంవత్సరాలుగా హక్కులు నిరాకరించి, అవకాశాలు హరించి అణచివేతకు గురైన తమిళజాతి మేల్కొన్న చరిత్రే డీఎంకే చరిత్ర అన్నారు. అలాంటి చరిత్రను, నాయకుల కృషిని గుర్తు చేసుకునే అవకాశాన్ని ఈ కార్యక్రమాలు అందిస్తున్నాయని తెలిపారు. మన సామాజిక న్యాయం, కరుణానిధి హయాంలో పబ్లిక్ ప్రవేశ పరీక్షలను రద్దు చేయడం, తొలితరం పట్టభద్రులకు వృత్తివిద్య రుసుమును ప్రభుత్వమే భరించడం వంటివాటితో నేడు రాష్ట్ర యువకులు ప్రపంచవ్యాప్తంగా పలు సంస్థల్లో కీలక బాధ్యతల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సెప్టెంబరుకు మాత్రమే పరిమితమవకుండా కొనసాగాలని కోరారు. అసత్యాలు, దుష్ప్రచారాలు, సగం సత్యాలు మాత్రమే చెప్పి కొందరు గందరగోళానికి గురి చేస్తారని, వాటితో ఎవరూ మోసపోకూడదని తెలిపారు. ఐటీ విభాగం ఉద్రేకానికి గురికాకూడదని, అప్రమత్తతతో బాధ్యతలు నిర్వర్తించాలన్నారు.

గుండెల నిండా గుర్తింపు

జీఐ ట్యాగుల్లో రాష్ట్రానికి రెండో స్థానం



'తమిళనాడు స్టాట్స్' బృంద సభ్యులు రూపొందించిన లోగో

మరిన్ని పెంచేలా ప్రభుత్వ చర్యలు

భౌగోళిక గుర్తింపు(జీఐ) పొందిన ఉత్పత్తులకు తమిళనాడు పెట్టింది పేరు. ఇక్కడ దొరికే రకాలు అలాంటివి మరి. భవిష్యత్తులో మనసుల్ని హత్తుకునేలా జీఐ సంఖ్య పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా వివిధ సంఘాల నుంచి దరఖాస్తులు సైతం వెల్లువెత్తుతున్నాయి.

ఈనాడు-చెన్నై

ఈ ఏడాది జనవరి నాటికి 59 ఉత్పత్తుల రిజిస్ట్రేషన్లతో తమిళనాడు దేశంలోనే తొలిస్థానంలో నిలిచింది. ఆ తర్వాత కూడా ఇదే స్థాయిలో కొనసాగుతూ వచ్చింది. తాజాగా విడుదలైన జాబితాలో ఉత్తరప్రదేశ్ ఉత్పత్తులకు ఎక్కువ స్థానం లభించడంతో తమిళనాడు రెండోస్థానంలోకి వెళ్లింది. ఉత్తరప్రదేశ్ 74 ఉత్పత్తులతో తొలిస్థానంలో ఉండగా.. తమిళనాడు 59తోనే ఉంది. కొన్ని ఉత్పత్తుల్ని ఇతర రాష్ట్రాలతో కలిసి తమిళనాడు పంచుకున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ ప్రకటించింది. కేరళ, కర్ణాటకతో కలిపి రెండు ఉత్పత్తులు జీఐ కింద నమోదైనట్లు వెల్లడించింది.

కొనసాగిన హవా..

2004 ఏప్రిల్ నుంచి భౌగోళిక గుర్తింపు ఇవ్వడం మొదలుపెట్టారు. తొలి ఏడాది తమిళనాడు నుంచి ఎలాంటి ఉత్పత్తి ఎంపికవలేదు. 2005 ఏప్రిల్ నుంచి రాష్ట్ర హవా కొనసాగుతూ వచ్చింది. తొలిసారిగా సేలం వస్త్ర ఉత్పత్తులు, కాంచీపురం సిల్క్ నమోదవగా.. ఆ తర్వాత భవానీ జమక్కలం, మదురై, సుంగుడి, కోయంబత్తూరు గ్రైండర్ ఇలా 2006లోపే జాబితాలోకి ఎక్కాయి. అప్పటినుంచి తమిళనాడు నుంచి పెద్దఎత్తున ఈ గుర్తింపు కోసం పోటీపడటం కనిపించింది.

తంజావూరు మహిళల ఆనందం..



తంజావూరు బొమ్మలు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' 89వ ఎపిసోడ్‌లో ప్రత్యేకించి తమిళనాడులోని భౌగోళిక గుర్తింపుపై మాట్లాడారు. తంజావూరుకు చెందిన స్వయం సహాయక బృందంలోని మహిళల పనితీరును అభినందించారు. వారు తయారుచేస్తున్న తంజావూరు బొమ్మలు, కంచుశిల్పాలు ప్రసిద్ధి చెందాయని కొనియాడారు. వాటి విక్రయానికి ప్రత్యేకంగా కియోస్కులు ఏర్పాటుచేసే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఈ ఉత్పత్తులు సైతం భౌగోళిక గుర్తింపును పొందాయి.

జీఐ ట్యాగ్‌లు ఎన్ని..

చేతికళలు	వ్యవసాయం	ఆహారం	తయారీ
35	14	8	2

ఖండాలు దాటిన కార్పెట్



ఈరోడ్ జిల్లా భవానీ ప్రాంతానికి చెందిన కార్పెట్లు 'భవానీ జమక్కలం' పేరుతో 2005-06లో భౌగోళిక గుర్తింపు సాధించాయి. స్వదేశంతో పాటు విదేశాల్లో సైతం భారీ గిరాకీ ఉంది. ఇప్పటికే స్వీడన్, జర్మనీ, ఇటలీ, యూకే, సింగపూర్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇప్పటికీ ఈ ఉత్పత్తుల్ని దేశీయంగా కో-ఆప్టెక్స్ స్టోర్లలో విక్రయిస్తున్నారు. మయాంక్ బత్రా అనే డిజైనర్ ఈ కార్పెట్లతోనే వస్త్రాల్ని డిజైన్ చేసి అంతర్జాతీయ వేదికపై ఫ్యాషన్‌షోలు నిర్వహిస్తున్నారు.

సకల ఉత్పత్తుల ప్రదర్శన



ఈ ఏడాది మే మాసంలో మదురైలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ, మదురై అగ్రి బిజినెస్ ఇంక్యుబేషన్ ఫోరం(ఎంఏబీఐఎఫ్) కలిసి వినూత్న కార్యక్రమం చేశారు. రాష్ట్రంలో జీఐ గుర్తింపు సాధించిన ఉత్పత్తుల్ని ఒక్కచోటుకు చేర్చి 3రోజుల ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా సుమారు 100 స్టార్టప్, ఇతర సంస్థలకు అవకాశమిచ్చారు. ఈ తరహా ప్రదర్శనలు ఇతరచోట్ల కూడా నిర్వహించాలని అప్పట్లో అనుకున్నారు. ఈ సంవత్సరం చెన్నైలో నిర్వహించిన తమిళనాడు గ్లోబల్ ఇన్వెస్టర్ మీట్‌లోనూ ఈ ఉత్పత్తులు ప్రదర్శించారు.







● ఈరోడ్ ఎర్ర అరటి
● కొల్లిహిల్స్ మిరియాలు
● గ్లోరియోసా సుపర్బా పుష్పం

ప్రత్యేక లక్ష్యాలు..

రాష్ట్ర ప్రభుత్వం కొన్ని ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం 10 వ్యవసాయ ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు తెచ్చుకునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం రూ.30లక్షలు ఖర్చుపెడుతున్నారు. ఇందులో ఈరోడ్ ఎర్ర అరటి, కొల్లిహిల్స్ మిరియాలు, రాణిపేట మీనాంబూర్ సీరగ సాంబ, దిండుక్కల్ అయ్యంపాళయం నెట్టై తెన్నై, కరూరు, దిండుక్కల్, తిరుప్పూర్ పరిసరాల్లో పూసే గ్లోరియోసా సుపర్బా మొక్క విత్తనాలు తదితర ఉత్పత్తులున్నాయి.









1. అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల విన్యాసాలు
2. సుఖోయ్ 30ఎంకేఐ ఫైటర్ 3. సారంగ్ హెలికాప్టర్లు
4. సూర్యకిరణ్ ఏరోబ్యాటిక్స్..

మెరీనాలో వాయు విన్యాసాల పూర్వాభినయం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై మెరీనా తీరంలో 6న వాయు విన్యాసాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి మంగళవారం నిర్వహించిన పూర్వాభినయంలో రఫేల్ యుద్ధ విమానంతో పాటు 70 రకాల ఎయిర్ క్రాఫ్టులు పాల్గొన్నాయి. తేజస్, సుఖోయ్ 30 ఎంకేఐ, సారంగ్ హెలికాప్టర్, సూర్యకిరణ్ ఏరోబ్యాటిక్స్ బృందం గగనంలో విన్యాసాలు చేశాయి. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మళ్లీ పూర్వాభినయం జరగనుంది. 4న పూర్తిస్థాయిలో పూర్వాభినయం ఉంటుందని రక్షణ విభాగం ప్రకటనలో పేర్కొంది.

మెట్రో రెండోదశ పనులకు నిధులివ్వాలి

ప్రధానికి అన్నామలై లేఖ

సైదాపేట, న్యూస్‌టుడే: మెట్రో రైలు రెండోదశ పనులకు కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు అందించాలని ప్రధాని మోదీకి సోమవారం భాజపా రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై లేఖ రాశారు. అందులో.. చెన్నైలో మెట్రోరైలు రెండోదశ పనులకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శంకుస్థాపన చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధుల అనుమతికి ముందే తమిళనాడు ప్రభుత్వ పథకంగా ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రూ.63,246 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం నిధుల కొరతతో స్తంభించిందని అన్నారు. 50 శాతం నిధులు అందించేందుకు పరిశీలించాలని తమిళనాడు భాజపా తరఫున కోరారు.

రహదారి నిర్మాణాలు వేగవంతానికి వినతి

టీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కిలాంబాక్కం-చెంగల్పట్టు రహదారి సహా 11 కొత్త మార్గాలను అమల్లోకి తీసుకురావాలని రాష్ట్ర మంత్రి ఈవీ వేలు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. సోమవారం దిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. మదురవాయల్-చెన్నై రింగ్‌రోడ్, చెంగల్పట్టు-ఉళుందూర్‌పేట రహదారి తదితర పలు రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం వేలు విలేకర్లతో మాట్లాడుతూ రోడ్ల నిర్మాణానికి భూముల స్వాధీనంలో ఆటంకాలు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించి వీలైనంత త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారన్నారు.

కోల్పోయిన ఓట్లు తిరిగి పొందాలి: ఈపీఎస్



సమావేశంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, సీనియర్ నేతలు

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 10 శాతం ఓట్లు కోల్పోయామని, వాటిని తిరిగి పొందితే విజయం మనదేనని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి తెలిపారు. పార్టీ ఐటీ విభాగం నిర్వాహకుల సమావేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఎడప్పాడి పళనిస్వామి మాట్లాడుతూ.. రాజకీయ రంగంలో సాంకేతిక విభాగాన్ని తొలుత ప్రారంభించింది అన్నాడీఎంకేనే అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, సాంకేతిక విభాగం తిప్పికొట్టాలని సూచించారు. శాసనసభ ఎన్నికలకు ఇంకా 15 నెలలే ఉన్నాయని పేర్కొన్నారు. ఆ నేపథ్యంలో పార్టీ సమాచార, సాంకేతిక విభాగం మరింత పటిష్ఠంగా పని చేయాలని సూచించారు. తమిళనాడులో శాంతిభద్రతల పరిరక్షణ సమస్యను సెల్‌ఫోన్ ద్వారా ప్రజల వద్దకు చేర్చాల్సిన బాధ్యత ఐటీ విభాగానిదేనని తెలిపారు. రాష్ట్రంలోని 40 శాతం యువత ఓట్లు పొందేందుకు ఐటీ విభాగం కృషి చేయాలని సూచించారు.

● మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రంలో లాకప్‌డెత్‌లు పెరిగిపోయాయని పేర్కొన్నారు. తిరుచ్చి జిల్లాకు చెందిన ద్రావిడమణి అనే వ్యక్తి తిరుచ్చి సెంట్రల్ జైల్లో మృతి చెందినట్లు వచ్చిన వార్త దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. బాధిత కుటుంబానికి తగిన పరిహారం అందించాలని, మృతికి నిజమైన కారణాలు గుర్తించి, చర్యలు తీసుకోవాలన్నారు.

కంటి సమస్యలకు మెరుగైన చికిత్స

గుర్తించిన ఐఐటీఎం



అరుణ్ నరసింహన్

చెన్నై, న్యూస్‌టుడే: కంటి చికిత్స కోసం మెరుగైన డ్రగ్ డెలివరీ పద్ధతిని ఐఐటీ మద్రాస్ పరిశోధకుల బృందం గుర్తించింది. రెటీనాకు తేలికపాటి లేజర్ ఉష్ణప్రసరణ ద్వారా ఔషధాన్ని మెరుగ్గా ఇంజెక్ట్ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రదర్శించింది. రెటినల్ టియర్స్, డయాబెటిక్ రెటినోపతి, మాస్కులర్ ఒడిమా, రెటినల్ వెయిన్ ఆక్లూజన్ వంటి వ్యాధుల చికిత్సకు లేజర్ ఆధారిత రెటినల్ చికిత్సలు ఎక్కువగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో అంతకన్నా మెరుగైన విధానంపై ఐఐటీఎం పరిశోధకులు దశాబ్దం కిందట దృష్టి సారించారు. అందులో భాగంగా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ అరుణ్ నరసింహన్ శంకర నేత్రాలయలో డాక్టర్ లింగం గోపాల్ సహకారంతో మొదటిసారి రెటీనాపై బయోథెర్మల్ పరిశోధనను లేజర్ రేడియేషన్ ప్రభావంతో ప్రారంభించారు. ప్రస్తుత పరిశోధనను ఐఐటీ మద్రాస్ గ్రాడ్యుయేట్ విద్యార్థి శ్రీనివాస్ విభూతేతో కలిసి చేపట్టినట్లు ఐఐటీ మద్రాస్ ప్రకటనలో వెల్లడించింది.

నైరుతి రుతుపవనాల్లో 18 శాతం అధిక వర్షపాతం

ప్యారిస్, న్యూస్‌టుడే: నైరుతి రుతుపవనాల సమయంలో 18 శాతం వర్షం అదనంగా కురిసినట్లు చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. జూన్‌లో ప్రారంభమైన నైరుతి రుతుపవనాలు సెప్టెంబరు 30తో పూర్తయ్యాయి. గతంలోకన్నా ఈసారి అధిక వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు 389.2 మి.మీ. వర్షం కురిసింది. ఈ సమయంలో సగటు వర్షపాతం 328.5 మి.మీ. రాష్ట్రంలో సాధారణం కన్నా 18 శాతం అధికంగా కురిసిందని పేర్కొంది.

5 వరకు భారీ వర్షాలు..

కన్నియాకుమరి, అంతర తమిళనాడు ప్రాంతాల్లోని ఉపరితల ఆవర్తనం కారణంగా 5వ తేదీ వరకు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. చెన్నైలో రాబోయే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.

అధికారంలో భాగస్వామ్యం నినాదాన్ని కొనసాగిస్తాం



మాట్లాడుతున్న తిరుమావళవన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: అధికారంలో భాగస్వామ్యం నినాదాన్ని కొనసాగిస్తామని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ పేర్కొన్నారు. కళ్లకురిచ్చి సమీపంలో చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిలోని ఎరంజి ప్రాంతంలో పార్టీ తరఫున బుధవారం సాయంత్రం మద్య నిషేధం మహానాడు నిర్వహించనున్నారు. ఏర్పాట్లు పర్యవేక్షించడానికి సోమవారం కళ్లకరిచ్చికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని మహానాడును పార్టీ మహిళా విభాగం తరఫున నిర్వహించనున్నామని తెలిపారు. అన్ని పార్టీలు పాల్గొనాలన్నదే తమ అభిమతమని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఆదిద్రావిడులకు స్థానం కల్పించడం, అందులో ఒకరికి ఉన్నత విద్యాశాఖ మంత్రిగా నియమించడం హర్షణీయమని అందుకు సీఎంను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 47 ప్రకారం మద్యపాన నిషేధానికి సంబంధించి కేంద్రం జాతీయ విధానాన్ని ప్రకటించాలని, ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సభల్లో మద్యపాన నిషేధాన్ని అమలు చేయడానికి తీర్మానాలను ఆమోదించాలని వీసీకే తరఫున కోరారు.

రికార్డు సృష్టిస్తున్న రాష్ట్ర క్రీడాకారులు



క్రీడా పరికరాలు అందిస్తున్న ఉదయనిధి

ప్యారిస్, న్యూస్‌టుడే: తమిళనాడుకు చెందిన క్రీడాకారులు ప్రపంచ రికార్డులు సృష్టిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. విరుదునగర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో జిల్లాలోని 450 పంచాయతీలకు రూ.2.85 కోట్లు విలువైన డాక్టర్ కలైఙ్ఞర్ క్రీడా పరికరాల కిట్‌లు అందించారు. సీఎం ట్రోఫీ జిల్లాస్థాయి విజేతలు 2,111 మందికి రూ.42.96 లక్షల విలువైన బహుమతులు పంపిణీ చేశారు. 255 మంది దివ్యాంగులకు రూ.45.39 లక్షల విలువైన ఉచిత ఇంటి పట్టాలు, 30 మందికి బ్యాంకు రుణం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకు ముఖ్యమంత్రి ఈసారి బహుమతి నగదును రూ.37 కోట్లకు పెంచారన్నారు. సీఎం ట్రోఫీ పోటీలకు రూ.80 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. మదురై, విరుదునగర్‌లో పటిష్ఠ పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. కలెక్టరు జయశీలన్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



యాత్రికులకు స్వాగతం పలుకుతున్న మంత్రి నాజర్

గుజరాత్ నుంచి చెన్నై చేరుకున్న యాత్రికులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: గుజరాత్ రాష్ట్రం పావ్‌నగర్‌కు గత నెల 29వ తేదీ తీర్థయాత్రకు వెళ్లిన తమిళనాడుకు చెందిన యాత్రికులు మలేశ్రీ నదిలో ఏర్పడిన ఆకస్మిక వరదల్లో చిక్కుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా వరదల్లో చిక్కుకున్న వారిని గుజరాత్ అధికారులు కాపాడారు. తరువాత అక్కడి నుంచి నవజీవన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి మంగళవారం ఉదయం చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వారికి రాష్ట్ర మైనార్టీలు, ప్రవాస తమిళుల సంక్షేమశాఖ మంత్రి నాజర్ స్వాగతం పలికి ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన వాహనం ద్వారా సొంతూర్లకు పంపారు.

శంకర కళాశాలలో మాజీ సైనికులకు పుష్పాంజలి



మాజీ సైనికులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం సమీప ఏనాత్తూర్‌లోని శంకర ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రాంగణంలో మాజీ సైనికులకు పుష్పాంజలి ఘటించారు. ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనం సమర్పించారు. కాంచీపురం జిల్లా కూరం గ్రామానికి చెందిన హవల్దార్ ఏకాంబరం మూడేళ్ల కిందట అసోం సరిహద్దుల్లో గస్తీ నిర్వహిస్తుండగా వీర మరణం పొందారు. ఆయన కుటుంబానికి కళాశాల తరఫున సాయం అందించారు. కళాశాల ప్రిన్సిపల్ కె. ఆర్.వెంకటేశన్, మాజీ సైనిక సంక్షేమ సంఘం సీనియర్ సలహాదారు కెప్టెన్ సుబ్రమణి, ఎన్‌సీసీ అధికారి ధైవశిఖామణి, ఎన్‌సీసీ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రొఫెసర్ జె.రాధాకృష్ణన్ కృతజ్ఞతలు తెలిపారు.

పార్కుల పునరుద్ధరణకు చర్యలు

- మూడు కొత్త పార్కుల నిర్మాణం
- తాంబరం కార్పొరేషన్ వెల్లడి

– న్యూస్‌టుడే, వడపళని

తాంబరం కార్పొరేషన్ హోదా అందుకున్న తర్వాత తొలిసారిగా 30 పార్కుల్లో పునరుద్ధరణ పనులు, మరో మూడు కొత్త పార్కులను నిర్మించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. తాంబరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో 200 పార్కుల నిర్వహణ జరుగుతోంది. 30 పార్కులలో ఆధునిక బెంచీలు, నడక దారి, పచ్చదనం, క్రీడా పరికరాలు, తాగునీరు, విద్యుద్దీపాలు వంటి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. సేలైయూరు, ఇరుంబులియూరు, చిట్లపాక్కం, ఈస్ట్ తాంబరం ప్రాంతాల్లో పార్కులు ఇంకా అభివృద్ధికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి సరైన నిర్వహణ లేకపోవడంతో దుర్భర స్థితిలో ఉన్నాయి. సెయింట్ మార్క్స్ మెట్రిక్యులేషన్ పాఠశాలకు సమీపంలో ఉన్న పార్కుకు విద్యార్థులు నిత్యం వస్తుంటారు. సీసీ కెమెరాలు, వీధి దీపాలు సరిగ్గా పని చేయడం లేదు. సాయంత్రం వేళల్లో భద్రత కొరవడుతోందని, అధికారులు తగిన రక్షణ కల్పించాలని స్థానికులు పేర్కొంటున్నారు. ఇరుంబులియూరులో కూడా పరిస్థితి దాదాపు ఇలాగే ఉంది. నడక దారి కూడా ఉపయోగకరంగా లేదు. పార్కుకు సమీపంలో ఉండే స్తంభాలకు స్థానికులు పశువులను కట్టేస్తున్నారని చెబుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పరిష్కారం మాత్రం శూన్యంగానే ఉందన్నారు.



తాంబరంలోని గ్రాండ్ పార్కు

నిధులు ఉపయోగించాలి

పార్కుల అభివృద్ధికి కేటాయించిన నిధులతో మరమ్మతులు చేయాలని పలువురు కౌన్సిలర్లు ఇటీవల జరిగిన సమావేశంలో విజ్ఞప్తి చేశారు. పార్కులు చూడటానికి అందంగా ఉంటే సరిపోదని, సరైన రక్షణ కూడా ఉండాలని డీఎంకే కౌన్సిలర్ ఇందిరన్ పేర్కొన్నారు. పలు పార్కుల్లో కొత్తరకమైన క్రీడా పరికరాలు, తాగునీటి సదుపాయం, విద్యుద్దీపాల కొరత ఉందని కూడా ఇందిరన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏటా పార్కుల నిర్వహణకు ప్రభుత్వం అందిస్తున్న రూ.10 లక్షల నగదుకు తోడుగా కార్పొరేషన్ సీఎస్సార్ నిధుల కోసం ఎదురుచూస్తోంది. 2022లో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (ఆర్‌డబ్ల్యూఏ)ను పార్కుల నిర్వహణ కోసం అభ్యర్థించినా అంతగా స్పందన కనిపించలేదు. మరమ్మతులు పూర్తయిన తర్వాత సెన్సరీ, థీమటిక్ పార్కుల కోసం ఆలోచిస్తున్నామని కమిషనర్ బాలచందర్ పేర్కొన్నారు.



నాటకంలోని ఓ సన్నివేశం

సంగీతం.. ముక్తికి సోపానం

ప్యారిస్, న్యూస్‌టుడే: సంగీతం ముక్తికి సోపానంలాంటిదని నాటక కావలర్ 'చెమ్మల్' ఆర్ఎస్ మనోహర్ నెక్స్ట్ జనరేషన్ బృందం మైలాపూర్‌లోని రసిక రంజని సభ హాలులో సోమవారం రాత్రి ప్రదర్శించిన 'కర్ణాటక సంగీత వాగ్గేయకారులు' బహుభాషా నాటకం మరోసారి నిరూపించింది. రంగస్థల చరిత్రలో 15 భాషలలో కర్ణాటక సంగీతాన్ని సుసంపన్నం చేసిన 18 మంది సంగీత మహామహుల జీవితంలోని ప్రధాన ఘట్టాలను ప్రదర్శించి కళలకు ఎలాంటి అవధులు లేవని చాటింది. అరుదైన ఈ నాటకానికి దర్శకత్వం వహించిన ఎస్.శివప్రసాద్ త్యాగరాజు, ముత్తు తాండవర్, స్వాతి తిరునాళ్, జాన్ హిగ్గిన్స్ పాత్రలను, ఎస్ శ్రుతి ఎంఎస్ సుబ్బులక్ష్మిగా తమ పాత్రలలో పూర్తిగా ఒదిగిపోయి ప్రతిభావంతంగా పోషించారు. తెలుగులో అన్నమాచార్యగా శ్రీకృష్ణ, వేంకటేశ్వరస్వామిగా విక్రమ్‌సింగ్ అద్భుతంగా నటించారు. ప్రదర్శనలో భాగంగా కలైమామణి అనితా గుహ నిర్వహణలోని భరతాంజలి విద్యార్థుల నాట్య ప్రదర్శన అదనపు ఆకర్షణగా నిలిచింది. గుహ ప్రసాద్ సంగీతం, మనోకాంతి ప్రసరణ, పుణ్యకోటి ఆహార్యం ప్రదర్శనకు మరింత వన్నె తెచ్చాయి.



ఉత్తిరమేరూర్ నియోజకవర్గం వాలాజాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ విద్యార్థుల శిక్షణ, గ్రంథాలయాన్ని పరిశీలించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యామొళి - కాంచీపురం, న్యూస్‌టుడే

'ఆంబూర్ మదర్ థెరిస్సా' ఆలీస్ బ్రాయర్ కన్నుమూత



రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: 'ఆంబూర్ మదర్ థెరిస్సా'గా పిలువబడే పేదల పెన్నిధి ఆలీస్ బ్రాయర్ (86) అనారోగ్యంతో వేలూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం కన్నుమూశారు. అమెరికాకు చెందిన గెట్లెట్ బ్రాయర్ నాగర్‌కోయిల్‌లోని చర్చిలో మత బోధకుడిగా 1936లో చేరారు. ఈయనకు 1938లో ఆలీస్ బ్రాయర్ రెండో సంతానంగా జన్మించారు. నాగర్‌కోయిల్‌లో చిరుప్రాయాన్ని గడిపిన ఆలీస్ బ్రాయర్ కొడైక్కానల్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. అనంతరం అమెరికా వెళ్లిన ఆమె వైద్య విద్య పూర్తి చేసి 1968లో భారత్‌కు తిరిగి వచ్చారు. తిరుపత్తూరు జిల్లా ఆంబూరులోని బెతస్టా ఆస్పత్రిలో వైద్యురాలిగా చేరారు. గ్రామ గ్రామానికి వెళ్లి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. దీంతో ప్రజలు ఆమెను ఆంబూర్ మదర్ థెరిస్సాగా పిలువసాగారు. పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఆమె వివాహం కూడా చేసుకోలేదు. ఈమె సేవలను ప్రశంసిస్తూ పలు స్వచ్ఛంద సంస్థలు అనేక పురస్కారాలు అందజేశాయి. పెంపుడు జంతువులపై మమకారం పెంచుకున్న 86 ఏళ్ల ఆలీస్ బ్రాయర్ అనారోగ్యానికి గురవడంతో సెప్టెంబరు 24న వేలూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున తుది శ్వాస విడిచారు. వార్త విన్న ఆంబూర్‌వాసులు కంటతడి పెట్టారు. పెద్ద సంఖ్యలో పట్టణవాసులు ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమెరికాలోని ఆలీస్ కుటుంబీకులు ఇక్కడుకు వచ్చిన తర్వాత ఈనెల 3న బెతస్టా ఆస్పత్రి ప్రాంగణంలో ఖననం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

'ఆర్ఎంకేవీ' శతవార్షికోత్సవానికి సరికొత్త కలెక్షన్లు

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నై నగరంలోని ప్రముఖ వస్త్ర సంస్థ 'ఆర్ఎంకేవీ' శత వార్షికోత్సవం సందర్భంగా 'వీవ్స్ అండ్ వండర్స్' పేరిట సరికొత్త కలెక్షన్లను పరిచయం చేసింది. అడయారులో సోమవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు మాణిక్యవాసగం, శంకర్ కుమారస్వామి, మహేశ్, మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొని కలెక్షన్ల గురించి వివరించారు. వినియోగదారుల అభిరుచికి తగ్గట్లు సరికొత్త ఆవిష్కరణలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దానిమ్మపండు, నారింజ, ఉసిరి తదితరాలకు చెందిన సహజ సిద్ధమైన సుమారు 4000 రకాల రంగులలో వస్త్రాలు తయారు చేయించి విక్రయాలకు ఉంచినట్లు పేర్కొన్నారు. తాము ఏటా దీపావళికి ప్రత్యేక చీరలు ప్రవేశపెడుతుంటామని, ఆవిధంగానే ఈ ఏడాది కూడా కొన్ని చీరలను సిద్ధం చేసినట్లు వివరించారు. చేనేత కార్మికులకు కూడా ఆర్డర్లు ఇచ్చి వారికి తమ వంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు.





ప్రసంగిస్తున్న సంస్థ డైరెక్టరు మాణిక్యవాసగం ◗ శంకర్ కుమారస్వామి

తెలుగు తరగతులకు హాజరైనవారికి ధ్రువపత్రాల ప్రదానం 5న

టీనగర్, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు సమాఖ్య నిర్వహణలో ఉచిత తెలుగు తరగతులు పూర్తయిన సందర్భంగా ప్రశంసాపత్రాల అందజేత కార్యక్రమం 5వ తేదీ జరుగనుంది. ఆరోజు సాయంత్రం 3.30 గంటలకు టీనగర్ జీఎన్ శెట్టి రోడ్ అంకూర్ ప్లాజాలోని సమాఖ్య కార్యాలయంలో కార్యక్రమం జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రామమోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తెలుగు తరగతులకు హాజరైనవారికి ధ్రువపత్రాలు అందజేనున్నట్లు నిర్వాహకులు శ్రీలక్ష్మీమోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు.

మీ కుమార్తెకు వివాహం.. ఇతరుల పిల్లలకు సన్యాసమా?

ఈశా కేసులో హైకోర్టు ప్రశ్న

ప్యారిస్, న్యూస్‌టుడే: తన కుమార్తెకు వివాహం చేసిన జగ్గీ వాసుదేవ్ ఇతరుల పిల్లలను సన్యాసినులుగా ఎందుకు మార్చాలనుకుంటున్నారని మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. కోయంబత్తూరులో ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ నిర్వహిస్తున్న ఈశా యోగా కేంద్రంలో మహిళలు సన్యాసం తీసుకునేలా ప్రేరేపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలా యోగా కేంద్రంలో ఉంటున్న తన ఇద్దరు కుమార్తెలను అప్పగించాలని కోయంబత్తూరు వ్యవసాయ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ కామరాజ్ మద్రాసు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో ...తన ఇద్దరు కుమార్తెలు గీత, లత ఈశా యోగా కేంద్రంలో యోగా నేర్చుకునేందుకు వెళ్లి అక్కడే ఉండి పోయారన్నారు. ఈ విషయమై ఇదివరకే దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు.. కోయంబత్తూరు న్యాయమూర్తి పరిశీలించి నివేదిక దాఖలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఆ తర్వాత తమను ఇబ్బందికి గురిచేయకూడదని కుమార్తెలు సివిల్ కేసు వేశారని, తాను, తన భార్య మానసికంగా ప్రభావితమైనట్లు తెలిపారు. తమ కుమార్తెలను గదిలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఈశా యోగా కేంద్రానికి వ్యతిరేకంగా తాను ఏ ఆందోళన చేయకూడదని, అలా చేస్తే చనిపోయే వరకు నిరాహారదీక్ష చేపడుతుందని రెండో కుమార్తె తెలిపిందన్నారు. తమ కుమార్తెలు అక్కడి నుంచి బయటికొస్తే వారిని ఇబ్బంది పెట్టమని, ప్రత్యేక స్థలం ఇచ్చి ఏకాంతాన్ని కాపాడతానని, కుమార్తెలను అప్పగించాలని కోరారు. ఈ కేసు జస్టిస్ సుబ్రమణియన్, జస్టిస్ శివజ్ఞానం ఎదుట సోమవారం విచారణకు వచ్చింది. అప్పుడు ఇద్దరు కుమార్తెలను హాజరుపరిచారు. వారి వద్ద న్యాయమూర్తులు విచారణ జరిపారు. జగ్గీ వాసుదేవ్ తన కుమార్తెకు వివాహం చేసిన ఫొటో చూసిన న్యాయమూర్తులు.. ఇతరుల పిల్లలను సన్యాసినులుగా ఎందుకు మార్చాలని అనుకుంటున్నారని ప్రశ్నించారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, అనుకూలంగా లేమని తెలిపిన న్యాయమూర్తులు ఈ వ్యవహారంలో పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఈశా యోగా కేంద్రంపై ఇప్పటి వరకు ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి వివరాలు దాఖలు చేయాలని పోలీసులకు ఉత్తర్వులు ఇచ్చి విచారణ వాయిదా వేశారు.

కేంద్రంలో పోలీసుల తనిఖీ

రెడ్‌హిల్స్: కోవై జిల్లా ఎస్పీ కార్తికేయన్, సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి అంబిక నేతృత్వంలో అధికారుల బృందం ఈశా కేంద్రంలో మంగళవారం తనిఖీ చేపట్టింది. కేంద్రంలో ఇప్పటివరకు బస చేసిన వారి వివరాలు, అందులో మహిళలు, విదేశీయులు ఎంతమంది ఉన్నారు, అదృశ్యమైన వారు, మృతి చెందిన వారి వివరాలను సేకరిస్తున్నారు.

ఆరోగ్యశాఖలో 126 మంది కారుణ్య నియామకం: పుదువై సీఎం రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కారుణ్య ప్రాతిపదికన పుదుచ్చేరి ఆరోగ్యశాఖలో 126 మందిని నియమించనున్నట్లు సీఎం రంగసామి తెలిపారు. ఆరోగ్యశాఖ తరపున శుభ్రతా కార్మికులకు యూనిఫారం పంపిణీ, వైద్య శిబిరం ప్రారంభోత్సవం జవహర్‌నగర్‌లోని ఉలవర్‌కరై మున్సిపల్ కార్యక్రమంలో మంగళవారం నిర్వహించారు. పాల్గొన్న ముఖ్యమంత్రి రంగసామి వైద్య శిబిరాన్ని ప్రారంభించి కార్మికులకు యూనిఫారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దోమల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చెత్త తొలగింపు బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆ పనులను అధికారులు పర్యవేక్షించాలన్నారు. నిర్వహణ సరిగాలేకుంటే సదరు సంస్థకు జరిమానా విధించాలని చెప్పారు. కారుణ్య ప్రాతిపదికన ఆరోగ్యశాఖలో 126 మందిని నియమించనున్నామని, ఇందుకుగాను ఫైల్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.



ప్రసంగిస్తున్న రంగసామి



ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత ఉదయనిధి స్టాలిన్ మొదటిసారిగా సోమవారం రాత్రి మదురై చేరుకున్నారు. అక్కడి ఓ ప్రైవేటు హోటల్‌లో బస చేసిన ఆయన్ను మంగళవారం ఉదయం సినీనటుడు వడివేలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. - ప్యారిస్, న్యూస్‌టుడే

పురస్కారాలు ప్రదానం చేసిన ఉప ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: నగరంలోని కలైవాణర్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక బృందాలు, స్వయం ఉపాధి బృందాలకు, రుణాలు అందించిన బ్యాంకులకు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో తమిళనాడు మహిళాభివృద్ధి సంస్థ తరపున గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదర్శవంతంగా కొనసాగే 70 స్వయం సహాయక బృందాలు, సమాఖ్యలకు 2022-23, 2023-24వ ఏడాదికిగాను మణిమేఘలై పురస్కారాలు, రూ.1.18 కోట్ల నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందించారు. తమిళనాడు అర్బన్ హేబిటాట్ మిషన్ మార్గదర్శకాల మేరకు పనిచేసే 516 మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.30.20 కోట్ల రుణాలు, స్వయం ఉపాధి బృందాలకు రుణాలు అందజేతలో ఆదర్శంగా పనిచేసిన 13 బ్యాంకులు, బ్యాంకు శాఖల ఉద్యోగులకు పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు సుబ్రమణియన్, పీకే శేఖర్‌బాబు, మహానగర చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, ఎంపీలు దయానిధి మారన్, తమిళచ్చి తంగపాండియన్ తదితరులు పాల్గొన్నారు. ఉదయనిధి ఉప ముఖ్యమంత్రిగా పాల్గొన్న తొలి ప్రభుత్వ కార్యక్రమం ఇది కావడం గమనార్హం.



మాట్లాడుతున్న సెంజి మస్తాన్

రోజూ కార్యకర్తలను కలిసే అవకాశం దక్కింది

మాజీ మంత్రి సెంజి మస్తాన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: గతంలో వారానికి రెండు రోజులు మాత్రమే పార్టీ కార్యకర్తలను కలిసేవాడినని, ఇకపై రోజూ కలుస్తానని మాజీ మంత్రి సెంజి మస్తాన్ తెలిపారు. విళుపురం ఉత్తర జిల్లా డీఎంకే మహిళా విభాగ సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా డీఎంకే మహిళా విభాగం ఆర్గనైజర్ తిలకవతి విజయకుమార్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సెంజి మస్తాన్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్నేహితుడిగా ఉదయనిధి నాయకత్వాన్ని బలపరిచే విధంగా పని చేస్తానన్నారు.

గాంధీ విగ్రహాన్ని శుభ్రం చేసిన గవర్నర్



నీళ్లతో శుభ్రం చేస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి

చెన్నై, న్యూస్‌టుడే: గాంధీ జయంతి బుధవారం నిర్వహించనున్న నేపథ్యంలో గిండి గాంధీ మండపంలోని జాతిపిత విగ్రహాన్ని మంగళవారం గవర్నర్ ఆర్.ఎన్.రవి శుభ్రం చేశారు. తర్వాత 300 మంది వాలంటీర్ల సాయంతో ప్రాంగణంలోని చెత్తను తొలగించారు. గవర్నర్ సైతం బకెట్ పట్టుకుని చెత్తను సేకరించారు. ముందుగా వాలంటీర్లతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు.

కోర్టులో హాజరైన మంత్రి సెంథిల్ బాలాజీ

ప్యారిస్, న్యూస్‌టుడే: ఉద్యోగం పేరుతో మోసానికి పాల్పడినట్లు నమోదైన కేసులో మంత్రి సెంథిల్ బాలాజీ ప్రత్యేక కోర్టులో హాజరయ్యారు. 2011 నుంచి 2015 వరకు అన్నాడీఎంకే హయాంలో రవాణాశాఖ మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీ రవాణాశాఖలో ఉద్యోగం పేరుతో పలువురి వద్ద నగదు తీసుకుని మోసానికి పాల్పడినట్లు చెన్నై సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తం 47 మంది ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసు ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్న స్థితిలో మంగళవారం మళ్లీ విచారణకు వచ్చింది. సెంథిల్ బాలాజీ తదితరులు హాజరయ్యారు. కేసుకు సంబంధించిన అదనపు అభియోగపత్రం నకలు అందించారు. అదనపు అభియోగపత్రంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు 2,202 మంది ఉన్న నేపథ్యంలో 100 మందికి చొప్పున అందిస్తారని, పూర్తయిన తర్వాత అభియోగాలు నమోదు చేస్తారని న్యాయమూర్తి జయవేల్ తెలిపారు. విచారణ 24కి వాయిదా వేశారు.

విద్యుత్తు దహనవాటిక ఏర్పాటు చేయాలి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఊత్తుకోట సమీప వేలకాపురంలో సుమారు 2 వేల మంది నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎవరైనా చనిపోతే గ్రామ పొలిమేరలోని అరుణానది ఒడ్డున ఖననం చేస్తున్నారు. గ్రామానికి ప్రత్యేకంగా ప్రభుత్వం తరపున విద్యుత్తు దహనవాటిక ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్, పూండి బీడీవో, ఊత్తుకోట తాలూకా కార్యాలయాల్లో వినతులు సమర్పించినా ఫలితం దక్కలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామస్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనకు దిగారు. అనంతరం కలెక్టర్ ప్రభుశంకర్‌కు వినతిపత్రం అందజేశారు.

అన్నా వర్సిటీకి బాంబు బెదిరింపులు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై గిండిలోని అన్నా విశ్వవిద్యాలయానికి మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. గత ఆరు నెలలుగా వర్సిటీకి, ప్రైవేటు పాఠశాలలకు ఈ-మెయిల్ ద్వారా ఈ రకమైన బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. అన్నా వర్సిటీకి ఇలా రావడం 14వ సారి. అదేవిధంగా కోవిల్పాక్కంలోని ప్రముఖ ఆస్పత్రి, ముగప్పేర్‌లోని ప్రముఖ ప్రైవేటు పాఠశాలకు కూడా ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు బాంబు స్క్వాడ్ సాయంతో తనిఖీ చేపట్టారు. బాంబులు లభించలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీవీకే మహానాడు వేదిక నిర్మాణానికి భూమిపూజ నేడు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం మొదటి రాష్ట్ర మహానాడు ఈనెల 27వ తేదీ విళుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని వి.సాలై ప్రాంతంలో నిర్వహించనున్నారు. ఏర్పాట్లను పార్టీ నిర్వాహకులు చురుగ్గా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వేదిక నిర్మాణానికి మహాలయ అమావాస్య రోజైన బుధవారం భూమిపూజ చేయడానికి నిర్ణయించారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 4 లక్షల మంది పాల్గొనేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. బుధవారం జరిగే భూమిపూజ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, పలువురు నిర్వాహకులు పాల్గొంటారు.

జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విదేశాంగ మంత్రి జయశంకర్‌ను పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ కోరారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... శ్రీలంకకు కొత్త అధ్యక్షుడు ఎన్నికైన సందర్భంగా భారత విదేశాంగశాఖ మంత్రి జయశంకర్ 4వ తేదీ శ్రీలంక వెళ్తున్నారని తెలిపారు. ఇరు దేశాల సంబంధాలను మెరుగుపరిచేందుకు వెళ్లే ఆయన ప్రయాణం తమిళులకు లబ్ధి చేకూర్చేలా ఉండాలని కాంక్షించారు. శ్రీలంక యుద్ధం ముగిసి 15 ఏళ్లు అవుతున్నా అక్కడ యుద్ధ నేరాలకు పాల్పడిన వారిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని చెప్పారు. శ్రీలంక రాజ్యాంగంలో 13వ సవరణ ప్రకారం తమిళులకు అధికారం ఇవ్వాలని భారత్ డిమాండ్ చేసినా ఎలాంటి ప్రయోజనమూ కలుగలేదన్నారు. తమిళనాడు జాలర్లపై శ్రీలంక నావికాదళం దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

రైళ్ల సమాచారం

వడపళని, న్యూస్‌టుడే: పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీలు జత చేస్తున్నట్లు దక్షిణ రైల్వే మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ◗ 16057 చెన్నై సెంట్రల్ - తిరుపతి సప్తగిరి ఎక్స్‌ప్రెస్ 2 నుంచి 15 అక్టోబరు, 16058 తిరుపతి - చెన్నై సెంట్రల్ 2 నుంచి 15 వరకు ఒక జనరల్ రెండో తరగతి, ఒక ఛైయిర్ కార్‌తో నడుస్తుంది. ◗ 16053 చెన్నై సెంట్రల్ - తిరుపతి 2 నుంచి 15 అక్టోబరు, 16054 తిరుపతి - చెన్నై సెంట్రల్ 2 నుంచి అక్టోబరు 15 వరకు ఒక జనరల్ రెండో తరగతి, ఒక ఛైయిర్ కార్ బోగీ జత చేస్తారు. ◗ సికింద్రాబాదు డివిజన్‌లోని విజయవాడ - కాజీపేట - బల్లార్షా సెక్షనులో జరుగుతున్న ఇంటర్‌లాకింగు, ఇతర పనుల కారణంగా 03251 ధనపూర్ - ఎస్ఎంవీటీ బెంగళూరు 15.00 రైలు వయా పెరంబూరు, కాట్పాడి, జోలార్‌పైట్టై అక్టోబరు 6, 03252 ఎస్ఎంవీటీ బెంగళూరు - ధనపూర్ 23.50 అక్టోబరు 8, 03260 ఎస్ఎంవీటీ బెంగళూరు - ధనపూర్ 23.50 అక్టోబరు 3న రద్దయ్యాయి.

ఉగ్రవాదులకు అడ్డాగా తమిళనాడు: హిందూ మున్నని

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడు ఉగ్రవాదులకు అడ్డాగా మారుతోందని హిందూ మున్నని రాష్ట్ర అధ్యక్షుడు గాడేశ్వర సుబ్రమణియన్ ఆరోపించారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... లెబనాన్ దేశంలోని ఉగ్రవాద సంస్థ అయిన హెజ్బొల్లా చీఫ్ హసన్ నస్రుల్లాను ఇజ్రాయెల్ వైమానిక దళం మట్టుబెట్టిన నేపథ్యంలో ఆయనకు చెన్నై మిర్సాకిపేట్టై మసీదు ఎదుట బ్యానర్ ఏర్పాటు చేసి నివాళులర్పించడం దారుణమన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉగ్రవాద కార్యకలాపాలు జరిగినా దానికి కారణమైన నేరస్థులకు తమిళనాడులోని కొన్ని సంస్థలు మద్దతుగా ఉంటున్నాయని తెలిపారు. అంతేకాకుండా విదేశాల్లో తీవ్రవాదులు హత్యకు గురైతే తమిళనాడులో వారికి సానుభూతి తెలుపుతున్నారని విమర్శించారు. ఇది రాష్ట్రానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో మళ్లీ జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్ఎస్ఎస్ ఊరేగింపునకు అనుమతివ్వాలి: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ ఊరేగింపునకు ఎలాంటి కొత్త నిబంధనలు విధించకూడదని, ఇది వరకే ఉన్నవి పాటించి అనుమతివ్వాలని మద్రాసు హైకోర్టు పేర్కొంది. విజయదశమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 58 చోట్ల అక్టోబరు 6న ఊరేగింపునకు అనుమతివ్వాలని ఆర్ఎస్ఎస్ నిర్వాహకులు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. జస్టిస్ జయచంద్రన్ ముందు సోమవారం విచారణకు వచ్చినప్పుడు 42 చోట్ల అనుమతి ఇచ్చినట్లు, 16 చోట్ల భద్రతా కారణాలతో నిరాకరించినట్లు పోలీసుల తరపున తెలిపారు. మళ్లీ మంగళవారం విచారణకు వచ్చింది. అప్పుడు ప్రభుత్వం తరపున హాజరైన లాయర్.. నిరాకరించిన 16 ప్రాంతాల్లో 10 చోట్ల అనుమతిచ్చినట్లు పేర్కొన్నారు. మాంగాడు, రత్నగిరి, కొరట్టూర్ పాఠశాల యాజమాన్యం నుంచి బహిరంగ సమావేశం నిర్వహణకు అనుమతిపత్రం ఇస్తే అంగీకరించాలని, సమయపురంలో 20న ఇవ్వాలని, సేలయూర్‌కు బదులు సిట్లప్పాక్కంలో అనుమతి కోరితే ఇవ్వాలని, మేడవాక్కంలో మరో మార్గంలో అనుమతించాలని ఉత్తర్వులు ఇచ్చారు.

ఆరు జిల్లాల్లో సౌర విద్యుత్తు పార్కులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ప్రైవేట్‌గా విద్యుత్తు కొనుగోలు తగ్గించేందుకు 6 జిల్లాలలో సౌరవిద్యుత్తు పార్కులు ఏర్పాటుకు విద్యున్మండలి తీర్మానించింది. రాష్ట్రంలో ఏటా 300 రోజులకు పైగా సౌర విద్యుత్తు అందడానికి అనుకూలంగా వాతావరణం ఉన్నందున ఉత్పత్తికి ప్రైవేట్ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటివరకు 8,180 మెగావాట్ల సామర్థ్యంగల సౌర విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నగరపాలక, పురపాలక ప్రాంతాలు మినహా అన్ని జిల్లాల్లో తలా 50 నుంచి 100 మెగావాట్ల చొప్పున మొత్తం 4 వేల మెగావాట్ల సౌరవిద్యుత్తు పార్కులను ఏర్పాటు చేయాలని 2021-2022లో విద్యున్మండలి తీర్మానించింది. ఇందుకుగాను స్థలాలను సేకరించే పనిలో నిమగ్నమైంది. తిరువారూర్, కరూర్, నాగై, సేలం, చెంగల్పట్టు, కాంచీపురం తదితర 6 జిల్లాలలో 3,300 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. మొదటి పార్కు 50 మెగావాట్ల సామర్థ్యంతో తిరువారూర్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఇలాంటి పునరుత్పాదక విద్యుత్తు పనులు చేపట్టడానికి రాష్ట్ర హరిత ఇంధన సంస్థ అనే కొత్త సంస్థని ఈ ఏడాది మొదట్లో ప్రారంభించారు. దీని ద్వారా ఆరు జిల్లాలలో సౌర విద్యుత్తు పార్కులు ఏర్పాటు చేయడానికి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

విరుదునగర్‌లో మంగళవారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు పథకాలను ప్రారంభించారు. ఇందుకు సంబంధించి తిరునెల్వేలిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని శిలాఫలకం ఆవిష్కరిస్తున్న స్పీకర్ అప్పావు, జిల్లా కలెక్టర్ కార్తికేయన్ తదితరులు
- తిరునెల్వేలి, న్యూస్‌టుడే



మంజల్ వీరన్ నుంచి
టీటీఎఫ్ వాసన్ తొలగింపు


విలేకర్లతో మాట్లాడుతున్న చెల్అం

చెన్నై, న్యూస్‌టుడే: బైక్ సాహస వీడియోలతో పేరొందిన యూట్యూబర్ టీటీఎఫ్ వాసన్‌తో 'మంజల్ వీరన్' రూపొందుతోంది. సినిమా నుంచి టీటీఎఫ్ వాసన్‌ను తొలగిస్తున్నట్లు దర్శకుడు చెల్అం ప్రకటించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ..ఇప్పటికే ఇతర నటీనటులకు సంబంధించిన సన్నివేశాలను తెరకెక్కించామని, 35శాతం చిత్రీకరణ పూర్తయిందని వెల్లడించారు. టీటీఎఫ్ వాసన్ పలు పనుల్లో తీరికలేకుండా ఉండటంతో చిత్రీకరణకు ఆయన సమయం కేటాయించలేకపోతున్నారని, మరో కథానాయకుడిని ఎంపిక చేసి చిత్రీకరణ కొనసాగించనున్నామని పేర్కొన్నారు. 'ఆయనే సూపర్‌స్టార్, అయినా చిత్రం నుంచి తొలగిస్తున్నాం' అంటూ వెల్లడించారు.



వేదికపై మాట్లాడుతున్న శివకార్తికేయన్

మలేషియా, సింగపూర్ పర్యటనలో అమరన్ బృందం

చెన్నై, న్యూస్‌టుడే: రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా సమర్పిస్తున్న చిత్రం 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకుడు. శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించారు. 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రమోషన్ పర్యటనలో భాగంగా చిత్రబృందం మలేషియా, సింగపూర్ దేశాల్లో పర్యటించింది. శివకార్తికేయన్, సాయిపల్లవి, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో చిత్రబృందం విడుదల చేసింది.

ఇళయరాజాను కలిసిన రబ్బర్ పందు బృందం


ఇళయరాజాతో దినేశ్, హరీశ్ కల్యాణ్

చెన్నై, న్యూస్‌టుడే: ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై గ్రామీణ క్రికెట్ నేపథ్యంతో రూపొందిన చిత్రం 'లబ్బర్ పందు'. తమిళరసన్ పచ్చముత్తు దర్శకత్వంలో అట్టకత్తి దినేశ్, హరీశ్ కల్యాణ ప్రధాన పాత్రలు పోషించారు. సినిమా విడుదలై జనం ఆదరణాభిమానాలు చూరగొంటోంది. ఇప్పటికే చిత్ర బృందాన్ని నటుడు శివకార్తికేయన్ పిలిపించి అభినందించారు. దర్శకులు వెట్రిమారన్, పా.రంజిత్, క్రికెటర్లు అశ్విన్, హర్భజన్ సింగ్ తదితరులూ తమ 'ఎక్స్' పేజీల్లో అభినందించారు. తాజాగా చిత్రబృందం ప్రసిద్ధ సంగీత దర్శకుడు ఇళయరాజాను మర్యాదపూర్వకంగా కలిసింది. ఇళయరాజా సంగీతం సమకూర్చిన 'నీ పొట్టు వచ్చ తంగకుడం' పాటను సినిమాలో పలు సన్నివేశాల్లో బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించడం గమనార్హం.

వేట్టైయన్‌కు యు/ఏ ధ్రువపత్రం



చెన్నై, న్యూస్‌టుడే: దర్శకుడు జ్ఞానవేల్, సూపర్‌స్టార్ రజనీకాంత్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'వేట్టైయన్'. అమితాబ్ బచ్చన్ తదితర ముఖ్య నటులు పలువురు నటించారు. ఆయుధ పూజ సందర్భంగా 10న విడుదల చేయనున్నారు. చిత్రానికి సెన్సార్ బోర్డు యు/ఏ ధ్రువపత్రం అందించినట్లు నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ అధికారికంగా ప్రకటించింది. చిత్రం 2.43 గంటల నిడివితో ఉందని వెల్లడించింది.

మరికొన్ని సినీ విశేషాలు

- దర్శకుడు వెంకట్ ప్రభు, నటుడు విజయ్ కాంబినేషన్‌లోని 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'(ది గోట్) గత 5న విడుదలైన నేపథ్యంలో నెట్ ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫారంపై 3న విడుదల కానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.
- ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్‌కుమార్, త్రిష జంటగా నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తదుపరి సన్నివేశాలు స్పెయిన్‌లో జరగనున్నాయి. అర్జున్ దాస్, ప్రసన్న ముఖ్య పాత్రల్లో నటించనున్నట్లు కోలీవుడ్ సమాచారం. వచ్చే ఏడాది అభిమానుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.
- క్రిస్ తిరుకుమరన్ దర్శకత్వంలో అరుణ్ విజయ్, సిద్ధి ఇద్నాని జంటగా నటిస్తున్న చిత్రం 'రెట్ట తల'. తన్యా, బిగ్‌బాస్ ఫేమ్ బాలాజీ మురుగదాస్ తదితరులు ఇతర తారాగణం. శ్యామ్ సీఎస్ స్వరాలు అందించారు. తుది షెడ్యూల్ గోవాలో కొనసాగుతున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.


అరక్కోణం: ధ్రువపత్రాలు అందుకున్నవారితో మంత్రి ఆర్.గాంధీ


రెడ్‌హిల్స్: దివ్యాంగ క్రీడాకారిణికి ధ్రువపత్రం అందిస్తున్న మంత్రి నాజర్

విజేతలకు బహుమతుల ప్రదానం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప పట్టరైపెరుంబుదూరులోని డాక్టర్ అంబేడ్కర్ ప్రభుత్వ కళాశాలలో క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలు నిర్వహించారు. పలు విభాగాల్లో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర మంత్రి నాజర్ ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యేలు రాజేంద్రన్, చంద్రన్, జడ్పీ ఛైర్‌పర్సన్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ● అరక్కోణం: ముఖ్యమంత్రి ట్రోఫీ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు రాణిపేట జిల్లా కలెక్టరు కార్యాలయంలో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మంత్రి ఆర్.గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరు చంద్రకళ, ఆర్కాడు ఎమ్మెల్యే జేఎల్ ఈశ్వరప్పన్, రాణిపేట మున్సిపల్ అధ్యక్షురాలు సుజాత, ఆర్కాడు మున్సిపల్ అధ్యక్షురాలు శ్రీదేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చెన్నైలో ట్రాఫిక్ ఆంక్షలు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై మహానగరంలో బుధవారం తిరుమల గొడుగుల యాత్ర సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆ మేరకు ఉదయం 8 గంటల నుంచి యాత్ర వాల్‌టాక్స్ రోడ్డుని దాటే వరకు ఎన్‌ఎస్‌సీ బోస్‌సాలై, మింట్ సాలై, దాని లింక్ రోడ్లలో వాహనాలకు అనుమతి లేదు. ఈవీఆర్ సాలై, రాజాజీ సాలై, వాల్‌టాక్స్ రోడ్డు, బేసిన్ బ్రిడ్జి రోడ్డు, ప్రకాశంసాలైలో వెళ్లవచ్చు. ● మధ్యాహ్నం 3 గంటల నుంచి ఊరేగింపు ఎలిఫెంట్‌గేట్ వంతెన దాటే వరకు వాల్‌టాక్స్ సాలై, దాని లింక్ రోడ్లలో వాహనాలకు అనుమతి లేదు. బేసిన్ బ్రిడ్జి రోడ్డు, మింట్ వైపుగా ప్రకాశంసాలై లేదా రాజాజీ సాలై, ఈవీఆర్ సాలై, ముత్తుసామి సాలై, రాజాజీ సాలై గుండా వాహనాలు వెళ్లవచ్చు. ● ఊరేగింపు ఎలిఫెంట్‌గేట్ వంతెన దాటే సమయంలో చూళై రౌండ్ ఠాణా నుంచి డైమండ్ సాలైకి వెళ్లేందుకు అనుమతి లేదు. వాహనాలు చూళై హైవే, రాజా ముత్తయ్య సాలై వైపుగా వెళ్లవచ్చు. ● రాజా ముత్తయ్య సాలై వస్తున్నప్పుడు మనీష్ పాయింట్ నుంచి చూళై రౌండ్ ఠాణాకు వెళ్లేందుకు అనుమతి లేదు. వేప్పేరి హైవే మీదుగా వెళ్లాలి. ● చూళై హైవే వద్దకు వస్తున్నప్పుడు నారాయణగురు సాలై ఈవీకే సంపత్ సాలై జంక్షన్ నుంచి చూళై హైవేకి వెళ్లేందుకు అనుమతి లేదు. వేప్పేరి హైవే మీదుగా వెళ్లవచ్చు. ● ఆవదాని పాప్పయ్య సాలై వైపుగా యాత్ర వచ్చేటప్పుడు పెరంబూర్ బ్యారెక్స్ రోడ్డు జంక్షన్ నుంచి చూళై హైవేకి వెళ్లేందుకు అనుమతి లేదు. పెరంబూర్ బ్యారెక్స్ రోడ్డు వైపుగా వెళ్లాలి. ● పెరంబూర్ బ్యారెక్స్ రోడ్డుకి వస్తున్నప్పుడు డవ్‌టన్ జంక్షన్ నుంచి పెరంబూర్ బ్యారెక్స్ రోడ్డుకి వెళ్లకూడదు. నారాయణగురు రోడ్డు వైపుగా వెళ్లాలి. ● ఓట్టేరి జంక్షన్‌ని యాత్ర చేరుకుంటున్నప్పుడు మిల్లర్స్ సాలై జంక్షన్ నుంచి ట్రిప్లికేన్ రోడ్డు వైపుగా ఓట్టేరి జంక్షన్‌కి వెళ్లేందుకు అనుమతి లేదు. పురసైవాక్కం హైవే మీదుగా వెళ్లాలి. ● ఓట్టేరి జంక్షన్‌లో యాత్ర ఉన్నప్పుడు కొన్నూర్ హైవే, మేడవాక్కం ట్యాంక్ రోడ్డు నుంచి ఓట్టేరి జంక్షన్‌కి వెళ్లేందుకు అనుమతి లేదు. మేడవాక్కం ట్యాంక్ రోడ్డు వైపుగా వెళ్లాలి. ● కొన్నూర్ హైవేలో ఉన్న కాశీ విశ్వనాథర్ ఆలయం చేరుకుంటున్నప్పుడు ఓట్టేరి జంక్షన్, మేడవాక్కం ట్యాంక్ రోడ్డు నుంచి కొన్నూర్ హైవేకి వెళ్లేందుకు అనుమతి లేదు. ఆ వైపుగా వచ్చే వాహనాలు ఓట్టేరి జంక్షన్ నుంచి కక్స్ సాలై వైపుగా మేడవాక్కం ట్యాంక్ రోడ్డు జంక్షన్ నుంచి వీవీ కాలనీ (సౌత్) వీధి గుండా అయనావరం రోడ్డు వైపుగా వెళ్లవచ్చు.

ఆలయ స్థల ఆక్రమణ వ్యవహారం
సీబీఐ దర్యాప్తునకు అన్నాడీఎంకే పట్టు

సైదాపేట, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో ఆలయ స్థల ఆక్రమణ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొందరికి సంబంధమున్నందున సీబీఐ దర్యాప్తునకు లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రి సిఫారసు చేయాలని అన్నాడీఎంకే డిమాండ్ చేసింది. ఇందుకు సంబంధించి పార్టీ పుదుచ్చేరి రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ విలేకర్లతో మాట్లాడుతూ... పుదుచ్చేరి రాష్ట్రంలో ఆలయ స్థలాలు, ప్రభుత్వ భూములు, తీరప్రాంత భూములను రాజకీయ నేపథ్యం ఉండేవారు, పాలకులకు కావాల్సినవారు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. నకిలీ పట్టాలు, పత్రాలు తయారుచేసి ప్రభుత్వాధికారుల సహకారంతో విక్రయాలు జరుపుతున్నారని విమర్శించారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కామాక్షియమ్మాళ్ ఆలయ సమేత ఈశ్వరర్ ఆలయానికి సొంతమైన స్థలం ఆక్రమణకు గురైందని, ఇందులో అధికార పార్టీకి చెందినవారి హస్తం ఉందన్నారు. ఇందుకు సంబంధించి సీబీఐ దర్యాప్తునకు ఎల్జీ, సీఎం సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రయాణికుడి ఛార్జీలను పరిహారంతో చెల్లించాలి
వినియోగదారుల కమిషన్

టీనగర్, న్యూస్‌టుడే: టిక్కెట్టు రద్దు చేసుకున్న ప్రయాణికుడికి రూ.25 వేల పరిహారం చెల్లించాల్సిందిగా రైల్వేశాఖను తిరునెల్వేలి జిల్లా వినియోగదారుల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. తిరునెల్వేలి జిల్లాకు చెందిన ప్రభు తన కుటుంబీకులు ముగ్గురితో కలిసి ఏప్రిల్ 6న తిరునెల్వేలి నుంచి చెంగల్పట్టుకు వెళ్లేందుకు, తిరిగి విరుదాచలం నుంచి తిరునెల్వేలి వెళ్లేందుకు రూ.5,815 చెల్లించి టిక్కెట్టు రిజర్వేషన్ చేసుకున్నారు. అనివార్య కారణాలతో ప్రయాణం రద్దు చేసుకున్నారు. కమీషన్ తగ్గించుకుని మిగిలిన రూ.4,860 మొత్తాన్ని రైల్వే చెల్లించలేదు. బాధితుడు తిరునెల్వేలి వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. విచారణ ముగిసిన నేపథ్యంలో రైల్వేశాఖ ప్రభుకు రూ.25 వేల మొత్తాన్ని పరిహారంగా అందించాలని, కేసు నిమిత్తం మరో రూ.5 వేలను నెల రోజుల వ్యవధిలో చెల్లించాలని ఆదేశించింది.


శివాజీ గణేశన్ విగ్రహానికి నివాళి అర్పించిన ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, శివాజీ గణేశన్ కుటుంబ సభ్యులు

శివాజీ గణేశన్‌కు ఘన నివాళి

చెన్నై: నడిగర్ తిలకం శివాజీ గణేశన్ 97వ జయంతి సందర్భంగా అడయారులోని దేశ్‌ముఖ్ రోడ్డులో ఉన్న ఆయన స్మారక మండపంలోని విగ్రహానికి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి స్టాలిన్ పుష్పాంజలి ఘటించారు. వెంట మంత్రులు సామినాథన్, సుబ్రమణియన్, పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు ఉన్నారు. శివాజీ గణేశన్ కుమారులైన నటులు ప్రభు, రామ్‌కుమార్, మనమడైన నటుడు విక్రమ్ ప్రభు, సినీ గేయ రచయిత వైరముత్తు తదితరులూ చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించి తిరిగి వచ్చేటప్పుడు తన మార్గానికి అడ్డుగా నిలిచిన వ్యక్తులపై రామ్‌కుమార్ దురుసుగా ప్రవర్తించి చేయి చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్నాయి.


సైదాపేట: అన్నాడీఎంకే మాజీ మంత్రి జయకుమార్ తదితరులు

వృద్ధాప్య సంరక్షణ సహాయకుల శిక్షణ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై గిండి కలైజ్ఞర్ సెంటినరీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రభుత్వ వైద్య కళాశాలల పరిధిలోని 975 ప్రాంతాల్లో వృద్ధాప్య సంరక్షణ సహాయకుల శిక్షణ కోర్సును మంత్రి మా.సుబ్రమణియన్ ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వృద్ధులకు మంత్రి బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో 60 ఏళ్లు దాటిన వృద్ధుల కోసం ప్రత్యేక ఆస్పత్రి ఎక్కడా లేదన్నారు. తమిళనాడు, దిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రుల్లోనే ఆ తరహా సౌకర్యం ఉందన్నారు. ఎయిమ్స్‌లోని ఒక అంతస్తులోనే వృద్ధుల ఆస్పత్రి నడుస్తోందన్నారు. ప్రత్యేక ఆస్పత్రి తమిళనాడులో మాత్రమే ఉందన్నారు. దేశంలో 15కోట్ల మంది వృద్ధులు ఉన్నారన్నారు. దేశంలో ఎక్కడా వృద్ధాప్య సంరక్షణ సహాయకుల విభాగం లేదన్నారు. రాష్ట్రంలో 13.7శాతం వృద్ధులు ఉన్నారని చెప్పారు. అందులో 10శాతం మంది వృద్ధులు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు.

ఆహారం లేక పశ్చిమ బెంగాల్ వ్యక్తి మృతి

ప్యారిస్: కుటుంబ ఆకలి తీర్చేందుకు చెన్నైకు కూలీ పనులు వెతుక్కుంటూ వచ్చిన పశ్చిమబెంగాల్ వ్యక్తి మృతిచెందాడు. పశ్చిమబెంగాల్‌కి చెందిన 11 మంది గతనెల వ్యవసాయ పనులకోసం చెన్నై వచ్చారు. పొన్నేరిలో మూడు రోజులు పనులు చేసిన తర్వాత మరే పనులు లభించక సొంతూరికి వెళ్లేందుకు 13న చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు వచ్చి అక్కడున్న ప్లాట్‌ఫాంపై ఉండిపోయారు. 16న ఉదయం వారిలో ఐదుగురు ఆహారం లేక స్పృహకోల్పోయి కనిపించారు. రైల్వే పోలీసులు వారిని రాజీవ్‌గాంధీ ఆస్పత్రికి తరలించారు. దర్యాప్తులో వారి పేర్లు సమర్‌ఖాన్, మాణిక్ గోరీ, సత్య పండిట్, ఆసిద్ పండిట్, కోనాస్ స్మిత్ అని తెలిసింది. వారిలో నలుగురు కొద్దిరోజుల ముందు డిశ్చార్జ్ అయ్యారు. చికిత్స పొందుతూ సమర్‌ఖాన్(35) మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సమర్‌ఖాన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పేదరికంతో ఉన్న కుటుంబ ఆకలిని తీర్చేందుకు జీవనాధారం వెతుక్కుంటూ వచ్చిన ఉత్తరాది కార్మికుడు మృతిచెందిన ఘటన కలకలం సృష్టించింది.


రాస్తారోకోలో పాల్గొన్న కార్మికులు

సామ్‌సంగ్ కార్మికుల రాస్తారోకో

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా సుంగువారిసత్రం వద్ద ఉన్న సామ్‌సంగ్ పరిశ్రమలో సీఐటీయూ కార్మిక సంఘాన్ని ప్రారంభించారు. ఈ సంఘాన్ని యాజమాన్యం ఆమోదించాలని, వేతనాలను పెంచాలని తదితర కోర్కెల సాధనకు గత కొద్ది రోజులుగా కార్మికులు సమ్మెబాట పట్టారు. ఇదిలా ఉండగా మంగళవారం కాంచీపురం గాంధీ రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అక్కడకు చేరుకుని కార్మికులను అరెస్ట్ చేశారు. ● వేళచ్చేరి: సామ్‌సంగ్ కార్మికులకు మద్దతుగా తిరుప్పూర్‌లో సీఐటీయూ కార్మిక సంఘం తరఫున రాస్తారోకో చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు మూర్తి నేతృత్వంలో నిర్వహించిన ర్యాలీలో సుమారు 200 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న సామ్‌సంగ్ కంపెనీ సెల్‌ఫోన్లను రోడ్డుపై పగులకొట్టి నిరసన తెలిపారు. 200 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

తామిరభరణి నదిలో కలుస్తున్న మురుగు
కాలుష్య నియంత్రణ బోర్డుకు నోటీసు

ప్యారిస్, న్యూస్‌టుడే: తామిరభరణి నదిలో మురుగు కలవడాన్ని అడ్డుకోవాలని దాఖలైన కేసులో కాలుష్య నియంత్రణ బోర్డు జవాబివ్వాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం నోటీసులు జారీచేసింది. తూత్తుక్కుడికి చెందిన కామరాజు 2018లో దాఖలు చేసిన పిటిషన్‌లో .. తిరునెల్వేలి జిల్లా తామిరభరణి నది ఒడ్డున పురాతన మండపాలు, ఘాట్‌లు ఉన్నాయని, వాటిని పునరుద్ధరించాలని, నదిలో మురుగు కలవకుండా అడ్డుకోవాలని ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. ప్రజాపనుల శాఖ తరఫున.. తామిరభరణి నదీ తీరాల్లో ప్రజలు నివసించే ప్రాంతాల వద్ద అధిక వ్యర్థాలు కలుస్తున్నాయని, నదుల కలుషితంపై కాలుష్య నియంత్రణ బోర్డు చర్యలు చేపట్టాలని తెలిపారు. న్యాయమూర్తులు.. కాలుష్య నియంత్రణ బోర్డు ఛైర్మన్, తూత్తుక్కుడి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, పర్యావరణశాఖ తిరునెల్వేలి, తూత్తుక్కుడి జిల్లాల పర్యవేక్షణ ఇంజినీర్లను న్యాయస్థానం సుమోటోగా ప్రతివాదులుగా చేర్చుతున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ప్రాంతాల్లో నదిలో మురుగు కలవడాన్ని అడ్డుకోవడానికి ఎలాంటి చర్యలు చేపట్టారో సంబంధిత శాఖ నివేదిక దాఖలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చి, విచారణ 3వ తేదీకి వాయిదా వేశారు.

సెప్టెంబరులో మెట్రోలో
92.77 లక్షల మంది ప్రయాణం

వడపళని, న్యూస్‌టుడే: మెట్రో రైళ్లలో సెప్టెంబరులో 92,77,697 మంది ప్రయాణించారు. ట్రావెల్ కార్డుతో 30,99,397, పేపర్ క్యూఆర్ 21,91,054, సింగార చెన్నై కార్డు 20,90,192, వాట్సాప్‌తో 5,92,360 మంది రాకపోకలు సాగించినట్లు సీఎంఆర్ఎల్ మంగళవారం ప్రకటనలో తెలిపింది.

ఆదివారం తరహాలో..బుధవారం గాంధీ జయంతి పురస్కరించుకుని మెట్రో సర్వీసులు ఆదివారం తరహాలో నడుస్తాయి. తెల్లవారుజామున 5 నుంచి రాత్రి 23.00 వరకు ఉంటాయి. మధ్యాహ్నం 12 నుంచి 2 వరకు ఏడు నిమిషాలకొకటి, తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 12 వరకు, 20.00 నుంచి 22.00 వరకు ప్రతి పది నిమిషాలకు, 22.00 నుంచి 23.00 వరకు ప్రతి 15 నిమిషాలకొకటి చొప్పున తిరుగుతాయన్నారు.

రైలు ఢీకొని కళాశాల విద్యార్థిని మృతి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప తొళవూరుకు చెందిన సాయిశ్రీ (20) చెన్నైలోని వళ్లియమ్మాళ్ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె సోమవారం సాయంత్రం సెవ్వాపేట రైల్వేస్టేషన్లో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సూట్‌కేస్‌లో మహిళ మృతదేహం లభ్యం

సేలం, న్యూస్‌టుడే: సేలం జిల్లా సంగగిరి సమీపంలోని జాతీయ రహదారిపై ఆవరంగంపాళ్యం సర్వీస్ రోడ్ వద్ద ఓ సూట్‌కేసు నుంచి దుర్వాసన రావడాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని సూట్‌కేసును స్వాధీనం చేసుకుని దానిని తెరవగా మహిళ మృతదేహం కనిపించింది. అనంతరం పోస్టుమార్టానికి తరలించారు. మృతురాలికి సుమారు 30 ఏళ్ల వయసు ఉంటుంది. వివరాలు తెలియలేదు. దర్యాప్తు కొనసాగుతోంది.

క్రైం కార్నర్

ఏడేళ్ల బాలికకు లైంగిక వేధింపులు
వృద్ధుడి అరెస్ట్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి బాగూర్‌కు చెందిన రాధాకృష్ణన్ (65) ఆ ప్రాంతానికి చెందిన ఏడేళ్ల బాలికకు గత కొన్నిరోజులుగా చాక్లెట్ ఇస్తానని చెప్పి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టి పోక్సో చట్టం కింద మంగళవారం రాధాకృష్ణన్‌ని అరెస్ట్ చేశారు.

పోక్సో చట్టం కింద పెయింటర్...


శరత్‌కుమార్

రెడ్‌హిల్స్: తిరుత్తణికి చెందిన 10 ఏళ్ల బాలిక పాఠశాలకు వెళ్లేటప్పుడు పట్టాభిరామపురానికి చెందిన పెయింటర్ శరత్‌కుమార్ లైంగికంగా వేధించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు తిరుత్తణి మహిళా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వారు దర్యాప్తు చేపట్టి నిందితుడిని మంగళవారం పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

గంజాయి విక్రేతలు ఇద్దరు...

ప్యారిస్: తేని జిల్లా బోడికి చెందిన జ్యోతి అనే మహిళ సెల్‌ఫోన్‌లో ఎవరెవరితో మాట్లాడుతోందనే దానిపై పోలీసులు నిఘా ఉంచారు. ఇదివరకే ఆమెపై గంజాయి రవాణా, విక్రయం మొదలైన ఐదు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జ్యోతితో తిరుప్పూర్‌కి చెందిన గుకేష్‌కుమార్ గంజాయి విక్రయం గురించి మాట్లాడటాన్ని పోలీసులు గుర్తించారు. అతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో ఉన్నట్లు, అక్కడి నుంచి గంజాయి తీసుకొస్తున్నట్లు తెలిసింది. ఆ మేరకు మంగళవారం తేనికి వచ్చిన గుకేష్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి 10.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా జ్యోతిని కూడా అరెస్టు చేశారు.



చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం పింక్ క్లినిక్‌ను ప్రారంభించి ప్రసంగిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి - చెన్నై, న్యూస్‌టుడే


ర్యాలీగా వస్తున్న ఆటో డ్రైవర్లు

పుదుచ్చేరిలో ఆటో డ్రైవర్ల సమ్మె

ఆర్కేనగర, న్యూస్‌టుడే: అద్దె వాహనాలను నిషేధించాలని కోరుతూ పుదుచ్చేరిలో మంగళవారం ఆటో డ్రైవర్లు సమ్మె చేశారు. డ్రైవర్లు ఏకరూప దుస్తుల్లో ప్రదర్శన నిర్వహించారు. పుదుచ్చేరిలో అద్దె వాహనాలు, ఈ బైక్ సేవలను ఆపేయాలని, నాన్ ఆర్గనైజేషనల్ వెల్ఫేర్ బోర్డును వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వం యాప్‌ను రూపొందించి కనీస ఆటో ఛార్జీ నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అన్ని ఆటో సంఘాలు మంగళవారం సమ్మెబాట పట్టాయి. పాఠశాలలకు రోజూలానే ఆటో డ్రైవర్లు తీసుకెళ్లి, అనంతరం సమ్మెలో పాల్గొన్నారు.

15 శాతం పెరిగిన అట్టపెట్టెల ధర

విల్లివాక్కం, న్యూస్‌టుడే: క్రాఫ్ట్ పేపరు ధర పెరగడంతో మంగళవారం నుంచి అట్ట పెట్టెల ధర 15 శాతం పెంచినట్లు ఉత్పత్తిదారులు ప్రకటించారు. రాష్ట్రంలో ఈరోడ్, తిరుప్పూర్, నామక్కల్, కోవై తదితర ప్రాంతాలలో ఆర్డర్ మేరకు అట్టపెట్టెల తయారీ ముమ్మరంగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో తయారీకి ఉపయోగిస్తున్న ముఖ్యమైన ముడి వస్తువు క్రాఫ్ట్ పేపర్ ధర నెల రోజుల్లో మూడుసార్లు పెరిగింది. దీంతో ఈ ఏడాదికి ముందే తీసుకున్న ఆర్డర్లకు అదే ధరకు అందజేయలేని పరిస్థితి నెలకొంది. ఇందుకు సంబంధించి దక్షిణ భారత అట్టపెట్టెల ఉత్పత్తిదారుల సంఘం కోవై విభాగ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి సురేష్ నేతృత్వంలో గత నెల 29వ తేదీ తిరుప్పూర్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో చర్చించి అక్టోబరు 1 నుంచి ధర 15 శాతం పెంచాలని తీర్మానించారు. ఈ నేపథ్యంలో సోమవారం కరూర్‌లో కరూర్, నామక్కల్ జిల్లా నిర్వాహకుల సమావేశం జరిగింది. కరూర్ జిల్లాలోని వస్త్ర ఎగుమతి సంస్థలు, నూనెలు తదితర ఉత్పత్తిదారులు పెరిగిన ధరలకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

విజయ్ పార్టీతో భాజపాకే నష్టం
దురై వైగో

విల్లివాక్కం, న్యూస్‌టుడే: సామాజిక న్యాయం, లౌకికవాదంపై విజయ్ రాజకీయం చేస్తే మతపరంగా భాజపాకే నష్టం ఉంటుందని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి దురై వైగో అభిప్రాయపడ్డారు. ఆయన మంగళవారం పుదుక్కోట్టైలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారసత్వ ప్రాతిపదికన ఉదయనిధికి ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని, సామర్థ్యం, కార్యాచరణ కారణంగానే పదవి వరించిందని పేర్కొన్నారు. చర్చల ద్వారా కావేరి సమస్య పరిష్కరించుకోవచ్చన్నారు. పరందూర్ విమానాశ్రయ నిర్మాణానికి అక్కడి ప్రజల అభిప్రాయాల ఆధారంగానే ముందుకు సాగాలని కోరారు. తిరుమావళవన్ మద్యపాన నిషేధ మహానాడుకు పూర్తి మద్దతిస్తామన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నా కేంద్రం సాయం అందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఇప్పట్లో అవసరం లేదన్నారు. రాష్ట్రంలో భాజపా కాలుమోపకుండా కలిసికట్టుగా పనిచేస్తున్నట్టు చెప్పారు.

పాతకక్షలతో ముగ్గురిపై దాడి

పొన్నేరి, న్యూస్‌టుడే: మీంజూరు సమీప తోట్టక్కాడుకు చెందిన రఘుకు భార్య జయభారతి, కుమారులు విష్ణు, విశాల్, కోడలు అర్చన ఉన్నారు. విష్ణు, విశాల్‌పై మీంజూరు పోలీసుస్టేషన్లో పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి ఐదుగురితో కూడిన ముఠా రఘు, జయభారతి, అర్చనపై కత్తులతో దాడి చేసి పారిపోయింది. క్షతగాత్రులను కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. మీంజూరు పోలీసులు దర్యాప్తులో.. పొన్నేరికి చెందిన రౌడీషీటర్ లక్ష్మణన్‌ను జూన్‌లో విష్ణు హత్య చేశాడు. అందుకు ప్రతీకారంగా ఈ దాడి జరిగినట్లు దర్యాప్తులో తేలింది.

పుదుకోట్టై జైల్లో ఏడుగురు ఖైదీలకు అస్వస్థత

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుకోట్టై జిల్లా జైల్లో 450 మందికిపైగా ఖైదీలు శిక్ష అనుభవిస్తున్నారు. వీరికి సోమవారం రాత్రి జైల్లో చికెన్ భోజనం పెట్టారు. అది తిన్న పలువురు ఖైదీలు కడుపునొప్పితో బాధపడ్డారు. ఇందులో తంజావూర్‌కు చెందిన సెంగోల్‌కేశు, అరంతాంగికి చెందిన ఉలగనాథన్, తంజావూర్‌కు చెందిన నెప్రహూ, ఆలంగుడికి చెందిన సుబ్రమణి, ఓరత్తాడుకు చెందిన అజిత్‌కుమార్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో జైలు సిబ్బంది పుదుకోట్టై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



విమానాశ్రయంలో తాబేళ్లు స్వాధీనం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి సోమవారం అర్ధరాత్రి కౌలాలంపూర్ నుంచి మలేషియన్ ఎయిర్‌లైన్స్‌లో వచ్చిన ప్రయాణికుల వద్ద కస్టమ్స్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఇద్దరి వద్ద ఉన్న ప్లాస్టిక్ బుట్టల్లో పరిశీలించగా ఎరుపు రంగు చెవితో ఉన్న తాబేళ్లు కనిపించాయి. దీంతో ఇద్దరిని అరెస్టు చేశారు. బెసెంట్ నగర్‌లోని వన్యప్రాణుల సంరక్షణ విభాగానికి సమాచారం అందజేశారు. వాటిని పరిశీలించిన అధికారులు 12 మృతి చెందాయని, 19 అల్బినో రకానికి చెందినవని తెలిపారు. ఇద్దరు సరైన ధ్రువపత్రాలు లేకుండా తీసుకొచ్చినట్టు గుర్తించారు. ఈ తాబేళ్లతో స్థానికంగా ఉండే జంతువులు, మానవులకు హానికరమన్నారు. మిగిలిన తాబేళ్లను మలేషియాకు పంపేందుకు ఏర్పాట్లు చేశారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి సమీప ఆరంబాక్కం బజారు వీధిలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం కేంద్రం ఉంది. సోమవారం అర్ధరాత్రి కొందరు దుండగులు ఏటీఎంలో చోరీకి యత్నించి విఫలమయ్యారు. బ్యాంకు మేనేజరు ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నొచ్చికుప్పానికి చెందిన కన్నన్‌ను మంగళవారం అరెస్టు చేశారు.

బాలింత బలవన్మరణం


సురేఖ (పాతచిత్రం)

వేలూర్, న్యూస్‌టుడే: గుడియాత్తం సమీప గొల్లపల్లికి చెందిన విగ్నేష్ భార్య సురేఖ (23) నిండు గర్భిణి. ఈమెకు పురిటినొప్పులు రావడంతో సెప్టెంబరు 23న కుటుంబీకులు అడుక్కంపారైలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్చగా ఇద్దరు కవల పిల్లలు జన్మించారు. ఓ శిశువు బరువు తక్కువగా పుట్టడంతో ఇన్‌క్యుబేటర్‌లో ఉంచారు. దీంతో మనస్తాపానికి గురైన సురేఖ మంగళవారం ఆస్పత్రి భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.